ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024





లోక్‌సభ పోరుకు హస్తం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు పెద్దఎత్తున సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నేతలు కూడా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండుస్థానాల్లో ఏకంగా 90 మంది బరిలో ఉండేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మానుకోటకు 48 మంది, వరంగల్‌కు 42మంది దరఖాస్తు చేసుకోవడంతో పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా వుండగా, ప్రభుత్వ ఉద్యోగులు సైతం పోటీకి సై అంటున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలనకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. ఇందులోని సభ్యులు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ 90మందిలో ఎవరికి టికెట్ దక్కుతుందో చూడాలి మరీ..

- జనరల్ స్థానాల కంటే ఈ రెండు రిజర్వుడు స్థానాలకు భారీ డిమాండ్
- సీనియర్ నేతలతో పాటు అనేక మంది పోటాపోటీ
- బరిలో దిగేందుకు సై అంటున్న పలువురు ఉద్యోగులు
- అధిష్ఠానం ఆశీస్సుల కోసం ఢిల్లీ, హైదరాబాద్‌కు పరుగులు

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!



వరంగల్ ఎంపీ స్థానానికి 42, మహబూబాబాద్‌కు 48 మంది దరఖాస్తు

వరంగల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోని ఆశావహులు రాబోయే ఎంపీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 17ఎంపీ స్థానాలకు 309 దరఖాస్తులు రాగా, వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ సీట్ల కోసం 90మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడైన ఈ రెండు స్థానాలకు ఇంత పెద్దమొత్తంలో దరఖాస్తులు రావటంపట్ల పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతుంది. సీనియర్ నేతలతో పాటు కొత్తగా టికెట్ ఆశించే వారిలో ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారు. వారంతా పార్టీలో ఉన్న తమ గాడ్‌ఫాదర్ల ద్వారా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

రెండు స్థానాలపై ఆశావహుల ఆశలు

కాంగ్రెస్ ఎంపీ టికెట్లకు భారీగా డిమాండ్ ఉండగా.. ఎస్టీ రిజర్వుడైన మహబూబాబాద్, ఎస్సీ రిజర్వుడ్ అయిన వరంగల్ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందాయి. రాజకీయంగా చైతన్యవంతమైన ఓరుగల్లు నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలని పలువురు నేతలు, కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న వారు తహతహలాడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మరోసారి మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. 2009లో బలరామ్‌నాయక్ ఎంపీగా గెలిచి, మన్మోహన్‌సింగ్ కెబినేట్‌లో కేంద్ర సహాయ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత 2014, 2019 ఎన్నికల్లో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా గెలిచారు. వరంగల్ పార్లమెంట్ 1952లో ఏర్పడింది.



అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిరిసిల్ల రాజయ్య విజయం సాధించగా, 2014లో బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి విజయం సాధించగా, 2016లో జరిగిన ఉప ఎన్నికతో పాటు 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దయాకర్ విజయం సాధించారు. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీకి అవకాశం వచ్చింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటమే కాకుండా ఈ పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఓట్లు రెట్టింపు అయ్యాయి. దీంతో కాంగ్రెస్ టికెట్ కోసం భారీగా పోటి నెలకొంది. 2009 నాటి ఫలితాలను పునరావృతం చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేస్తోంది.

రెండు సీట్లు.. 90మంది దరఖాస్తులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా, 90మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో ఎస్టీ రిజర్వుడు స్థానమైన మహబూబాబాద్‌కు అత్యధికంగా 48మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధిక దరఖాస్తుల్లో మొదటి రెండు స్థానాలు ఉమ్మడి జిల్లా ఎంపీ స్థానాలకే దక్కింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి ప్రధానంగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో పాటు గత ఎన్నికల్లో పోటి చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్, డాక్టర్ రాగమల్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి తదితరులు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మహబూబాబాద్ టికెట్ కోసం ప్రధానంగా మాజీ కేంద్ర మంత్రి బలరామ్‌నాయక్‌తో పాటు బెల్లయ్య నాయక్, మోహన్‌లాల్, నెహ్రూనాయక్, నాగరాజు, సాంబయ్య తదితరులు టికెట్ రేసులో ఉన్నారు. వీరితో రెండు ఎంపీ స్థానాల కోసం సీనియర్ నేతలు, కొత్తగా పార్టీలో చేరి టికెట్ కోసం చాల మంది ఆశావహులు ప్రయత్నిస్తున్నారు.

పోటీకి పలువురు ఉద్యోగులు సై..

కాంగ్రెస్ టికెట్ ఆశించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా.. సీనియర్, జూనియర్ నేతలతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు కూడా రాజకీయంగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. పలువురు పోటికి సై అంటుండం

మిగతా 7వ పేజీలో..

ఐదుగురి పేర్లతో స్క్రీనింగ్

రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్‌చౌదరి, జిగ్నేష్‌మేవాని, విశ్వజిత్ కదమ్‌లతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం నుంచి 15వ తేదీలోపు తెలంగాణలో ఎంపీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. మొత్తం 17 ఎంపీ స్థానాల నుంచి వచ్చిన మొత్తం 209 దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లతో తొలి జాబితా తయారు చేయనున్నారు. తక్కువ దరఖాస్తుల వచ్చిన నియోజకవర్గాల్లో ముగ్గురు, ఎక్కువ దరఖాస్తులు వచ్చిన చోట నలుగురు, ఐదుగురితో జాబితా సిద్ధం చేయనున్నారు. వరంగల్ నుంచి 42, మహబూబాబాద్ నుంచి 48 దరఖాస్తులు రావటంతో ఒక్కో స్థానం నుంచి ఐదుగురితో జాబితా తయారు చేసి ఏఐసీసీకి పంపనున్నారు. ఈ ఐదుగురిలో చోటు దక్కిన వారి నుంచి ఒక్కరి టికెట్ ఖరారు చేసే బాధ్యతను ఏఐసీసీకే అప్పగించనున్నారు. దీంతో స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేసే ఐదుగురిలో తమ పేరు ఉంటుందా అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. 18వ తేదీ తరువాత అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. దీంతో 90 మంది ఆశావహుల్లో టికెట్ దక్కే ఆ ఇద్దరు ఎవరో అనేది క్యాడర్‌లో ఉత్కంఠ రేపుతోంది.



మేడారం ఈవో కార్యాలయం ఉన్న దేవాదాయ శాఖ ధార్మిక భవనం

నిర్వహణ బహుదూరం!

- హనుమకొండలో మేడారం ఈవో కార్యాలయం
- జాతర కార్యకలాపాలన్నీ నగరం నుంచే..
- ప్రతీ చిన్న పనికి 130 కి.మీ దూరం వెళ్లాల్సిందే..
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, పూజారులు



హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోకెల్లా అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కార్యాలయం లేకపోవడం గమనార్హం. సమ్మక్క-సారలమ్మల జాతర వ్యవహారాలను చూసే అత్యంత ముఖ్యమైన కార్యనిర్వహణాధికారి (ఈవో) కార్యాలయం మేడారానికి 130 కి.మీ. దూరంలో ఉన్న హనుమకొండలో ఉంది. సాధారణంగా ఆలయాల ఈవో ఆఫీసులు వాటి ప్రాంగణాల్లోనే ఉంటాయి. మేడారం విషయంలో మాత్రం ఇందుకు భిన్నం. అక్కడ జాతర.. ఎక్కడో ఆఫీసు అన్నచందంగా ఉంది. దీంతో జాతర సందర్భంగా పూజారులు, అధికారులు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాన్ని పూజారులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

హనుమకొండలో ఈవో ఆఫీసు

మేడారం జాతర నిర్వహణ విషయంలో దేవాదాయ శాఖ అధికారులకు ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. జాతర నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండాలి. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి. జాతరలో కీలక భూమిక పోషించే పూజారులకు నిత్యం అందుబాటులో ఉండాలి. ఈవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా మేడారానికి 130 కి.మీ.దూరంలో వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా గల ధార్మిక భవనంలో ఈవో కార్యాలయం కొనసాగుతోంది. పూజారులకు ఏ సమస్య వచ్చినా, ఏదీ కావాలన్నా, ఏ అనుమతి పొందాలన్నా, ఏదైనా అంశంపై

మిగతా 7వ పేజీలో..

గవర్నర్‌కు ఆహ్వానం



మేడారంలో ఈ నెల 21వతేదీ నుంచి 24వ వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు రావాలంటూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆహ్వానించారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీతక్క ప్రత్యేకంగా అమ్మవార్ల గద్దెల ప్రతిమలు, పసుపు, కుంకుమ భరిణలతో తయారుచేయించిన ఆహ్వానపత్రికతో పాటు చీరను అందించారు. సీతక్క వెంట కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి ఉన్నారు. ఇక ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి కూడా సీతక్క మేడారం వడ్డెలతో(పూజారులు) కలిసి ఆహ్వానం అందించగా ఆయన 23న వనదేవతల దర్శనానికి రానున్నారు. - మేడారం

పెగడపల్లిలో మెగా వైద్య శిబిరం

పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు

ప్రారంభించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ కిరణ్ ఖరే

మహాముత్తారం, ఫిబ్రవరి 8 : మండలంలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురువారం భూపాలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయంతమైంది. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే వైద్య శిబిరాన్ని ప్రారంభించి మొదటగా తానే పరీక్షలు చేయించుకున్నారు. తదనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ మాట్లాడారు. మారుమూల ప్రాంతంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఉద్దేశ్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మహాముత్తారం, పలిమెల, భూపాలపల్లి మండలాల ప్రజలు శిబిరానికి వచ్చారని చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని గొత్తికోయ గుంపులలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ యశోద ఆస్పత్రి సౌజన్యంతో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో విజయవంతం చేశామని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. సుమారు వెయ్యి మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామన్నారు. శిబిరానికి వచ్చిన ప్రతీ ఒక్కరికి భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, జడ్పీటీసీ శారద, ఎంపీడీవో ఆంజనేయులు, సీఐలు నాగార్జునరావు, నరేష్, రాజేశ్వరావు, వైద్యులు కిరణ్, శ్రీనివాస్, మహాముత్తారం ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా

వివరాలు నమోదు చేయాలి

- భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

గణపురం, ఫిబ్రవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గణపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జిదారుల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్‌లను ఒకటికి రెండు సార్లు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఏమైనా తప్పులు ఉన్నట్లయితే అర్జిదారుల ఇంటికి వెళ్లి సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించాలన్నారు. ఒకవేళ కంప్యూటర్ ఆపరేటర్ తప్పుగా టైప్ చేస్తే అర్జిదారులు అనర్హుడిగా మిగిలిపోతారని అన్నారు. కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పురుషోత్తం, తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీవో అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

● రేగొండ : ఆపరేటర్లు ఒక్క నంబరు తప్పుగా నమోదు చేసినా ఆరు గ్యారంటీలకు అనర్హులు అవుతారని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల సవరణలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్లను క్షుణ్ణంగా పరిశించి నమోదు చేయాలని సూచించారు. తప్పుగా నమోదు చేసి ఉంటే దరఖాస్తుదారుడితో ఫోన్‌లో సంప్రదించి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శామ్యూల్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



గణపురంలో అభయహస్తం దరఖాస్తులను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం పరిశీలన

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వడానికి గాను ఎన్‌పీడీసీఎల్ బృందం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనుందని ఏఈ విశ్వాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై తమ సిబ్బంది దరఖాస్తుల కోసం ఇంటి వద్దకు వచ్చినప్పుడు ఆహార భద్రత కా ర్డు, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచిం చారు. ఏదైనా కారణం చేత తమ సిబ్బంది వచ్చినప్పుడు ఇంటి వద్ద లేని టైతే దగ్గరలో విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో వివరాలను అందజేయాలని కోరారు.

పుడ్‌సేఫ్టీ మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్



ములుగులో పుడ్‌సేఫ్టీ మొబైల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

8లో

బినామీ డీలర్లకు చెక్..!

- రేషన్ పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి
- జిల్లాలో జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డీలర్లు



భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 8: ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అస్తవ్యస్తంగా ఉన్న రేషన్ డీలర్ల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రేషన్ డీలర్లు, పౌరసరఫరాల అధికారులపై నిత్యం ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా డీలర్లలో పెద్దఎత్తున బినామీలు ఉన్నట్లు ఆరోపణలు వస్తుండటంతో పరిస్థితులను చక్కదిద్దేందుకు వారి జాబితాను సిద్ధం చేయమని ఇప్పటికే ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గత జనవరి 31 వరకు బినామీల లిస్టు తీసి ఏరివేయాలని ఆదేశించినప్పటికీ క్షేత్ర స్థాయిలో వారి గుర్తింపు ఆలస్యమవుతోంది.

జిల్లాలో 277 రేషన్ షాపులు

భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 277 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,23,636 రేషన్ కార్డులు ఉంటే 3.46 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. 277 రేషన్ దుకాణాల్లో మూడోవంతు దుకాణాలను బినామీలే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదులు నిత్యం అందుతున్నాయి. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహన్ దృష్టి సారించడంతో పాటు బినామీలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించడంతో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ మొదలుపెట్టారు. చాలా వరకు దుకాణాలు అసలు డీలర్ల కంటే ఇతరులే బంధుత్వం, గుమాస్తాల పేరిట దర్శనం ఇస్తుండటంతో బినామీల గుర్తింపు అధికారులకు కష్టతరం అవుతోంది. కమిషనర్ ఇచ్చిన గడువు జనవరి 31తో ముగియడంతో విచారణను తహసీల్దార్లు వేగవంతం చేశారు. మరో రెండు రోజుల్లో జిల్లాలో బినామీ రేషన్ డీలర్లు ఎంత మందో బయటపడనుంది.

ఉపాధి మాటున దందా..

రేషన్ దుకాణాల పేరిట ప్రభుత్వం పలువురికి ఉపాధి కల్పిస్తే దీన్నే కొందరు తమ అక్రమార్జనకు ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలో ఉన్న 277 రేషన్ షాపుల్లో చాలా వరకు అసలు రేషన్ షాపు ఓనర్ కంటే ఇతరులే ఎక్కువగా నిర్వహిస్తున్నారు. బినామీలుగా వ్యవహరిస్తూ రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందాకు పాల్పడుతున్నట్లు సమా చారం. వీరికి రాజకీయ నాయకుల అండ దండలు ఉండటంతో యథేచ్ఛగా బియ్యం దందాను చేస్తున్నారు. వీరికి కొందరు అధికారుల అండదండలు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో ఇటీవల పెద్దమొత్తంలో పట్టుబడ్డ రేషన్ బియ్యంలో వీరి పాత్ర ఉన్నట్లు తెలిసింది. రేషన్ షాపుల్లో నిల్వల్లో అక్రమాలు చోటుచేసుకున్నా యూనియన్ల పేరిట అధికారులను మచ్చిక చేసుకొని 6ఏ కేసులు నమోదు కాకుండా తప్పించుకుంటున్నారు. డీలర్‌కు ఇంత చొప్పున డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టజెప్పు తున్నట్లు సమాచారం. అలాగే ప్రభుత్వం కొనుగోలు చేసి సీఎంఆర్ చెల్లించాలని కేటాయించిన ధాన్యంను మిల్లర్లు అమ్ముకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిం ది. జిల్లాలోని కొందరు మిల్లర్లకు రీసైక్లింగ్ దందాలో కొంత మంది రేషన్ డీలర్లు సహకరిస్తున్నట్లు సమాచా రం. కొందరు వ్యక్తులు రీసైక్లింగ్ దందాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షల్లో సంపాదిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇంట్లో ఒకరికే ఉపాధి

రేషన్ షాపుల్లో బినామీల లిస్టు రెడీ చేసి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామంలో ఇంట్లో ఒకరికే ఉపాధి కల్పించేలా ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

జిల్లాలోని రేషన్ షాపులు, లబ్ధిదారుల వివరాలు

మండలం	షాపులు	కార్డులు	లబ్ధిదారులు
భూపాలపల్లి	33	20,413	57,772
చిట్యాల	26	11,341	32,079
గణపురం	19	11,388	31,923
కాటారం	28	11,403	31,950
పలిమెల	6	2,321	6,602
మహాముత్తారం	26	8,436	24,389
మహదేవపూర్	22	10,064	28,176
మల్హర్‌రావు	19	8,879	24,262
మొగుళ్లపల్లి	28	11,592	23,492
టేకుమట్ల	24	8,575	23.492
రేగొండ	46	19,227	54,974



ఢిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో కమిషనర్ ప్రజంటేషన్

- జ్యూరీ ఇంటర్వ్యూలకు ఎంపికపై ఉత్కంఠ
- ఎంపికైతే నగరానికి రూ.135 కోట్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 8: ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్‌లో నిర్వహించిన సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టూ ఇన్నోవేటివ్ అండ్ సస్టైన్ (సీఐటీఐఐఎస్) స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్ జరిగింది. తొలి దశలో ఎంపికైన దేశంలోని 84 నగరాలు చాలెంజ్‌లో పాల్గొన్నాయి. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఛాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొని వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, మారిన నగర రూపురేఖలు, భవిష్యత్తులో నగర అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. రాష్ట్రంలో వరంగల్ రెండో అతిపెద్ద నగరం, చారిత్రక నేపథ్యం, హైదరాబాద్ తరువాత అభివృద్ధి చెందుతున్న తీరు, స్మార్ట్‌సిటీ చాలెంజ్‌కు ఎంపికైన వివరాలను కమిషనర్ ప్రజెంట్ చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్‌టీపీల నిర్మాణంలో వరంగల్ నగరం ఇతర దేశాలకే ఆదర్శంగా నిలిచిన పరిణామాలను తెలియచేశారు. ఈ పోటీలో కమిషనర్‌తో పాటు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పాల్గొన్నారు.

ఎంపికైతే భారీగా అభివృద్ధి నిధులు

తొలి దశలో ఎంపికైన 84 నగరాలు ఢిల్లీలో జరిగిన చాలెంజ్‌లో పాల్గొనగా వీటినుంచి 18నగరాలను జ్యూరీ ఇంటర్వ్యూలకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండర్ అర్బన్ ఎఫైర్స్ ఎంపిక చేస్తుంది. త్వరలో ఈ వివరాలను వెల్లడిస్తారు. 18నగరాల్లో వరంగల్ నగరం ఒకటిగా ఎంపికైతే కేంద్రం రూ.135 కోట్లను నగరాభివృద్ధి కోసం విడుదల చేస్తుంది. ఈక్రమంలో జ్యూరీ ఇంటర్వ్యూ, నగర ఎంపిక అంశాలపై ఉత్కంఠ నెలకొంది. నగరం తప్పక ఎంపికవుతుందనే ఆశాభావాన్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తం చేశారు.



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన అభినవ్ భాస్కర్

బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 8: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 60వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు దాస్యం అభినవ్ భాస్కర్ బీజేపీలో చేరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, డి.కె.అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో అభినవ్‌భాస్కర్ బీజేపీలో చేరారు. బీజేపీ కండువా కప్పి అభినవ్‌భాస్కర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్ ఆ పార్టీ జాతీయ నేతలు బీ.ఎల్.సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్‌చుగ్, ఎంపీ అరవింద్, చంద్రశేఖర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా అభినవ్ భాస్కర్ పార్టీ మారడం, బీజేపీలో చేరడం వెనుక ఆ పార్టీ జాతీయ నేత ఈటల రాజేందర్ చక్రం తిప్పినట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీలో సముచిత స్థానం కల్పించడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఇస్తామనే హామీ బీజేపీ నుంచి తీసుకుని అభినవ్‌భాస్కర్ పార్టీ మారినట్లు పార్టీ వర్గాల సమాచారం.

రుణం వస్తుందని నమ్మించి మోసం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఫేస్‌బుక్‌లో పరిచయమై లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన షేక్ మంజోరీలహిర్ అనే వ్యక్తికి ఇటీవల ఫేస్‌బుక్‌లో గుర్తు తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఎలాంటి ఆధారాలు లేకుండానే లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి ఇంకా పరిచయం పెంచుకున్నాడు. ముందుగా ధన్‌లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. పూర్తి వివరాలు కావాలని కోరడంతో ఆధార్ కార్డు, ఫొటోలు పంపించాడు. లోన్ పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని క్యూఆర్ కోడ్‌ను పంపించాడు. స్కాన్ చేయడంతో బ్యాంకు నుంచి రూ.25వేల నగదు డ్రా అయినట్టు గుర్తించాడు. 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో రూ.1.18 లక్షలకు టోకరా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఆల్‌లైన్‌లో కార్లు బుక్ చేస్తే కమీషన్ దండిగా వస్తుందని చెప్పడంతో ఒకరు నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ రెడ్డికాలనీలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డికాలనికి చెందిన పిల్లలమర్రి శ్రవన్ అనే వ్యక్తి గూగుల్‌లో వెతుకుతుండగా పార్ట్‌టైమ్ జాబ్ అని వచ్చింది. దీనిలో వెతకగా ఒక కంపెనీలో ఉద్యోగం ఖాళీగా ఉందని, ప్రతీరోజు సెల్‌ఫోన్‌లో కార్లు బుక్ చేస్తే నెలకు సరిపడా డబ్బులు వస్తాయని చాటింగ్ ద్వారా తెలుసుకున్నాడు. వారు ఆన్‌లైన్‌లో శ్రవన్‌కు గుర్తింపు కార్డు జారీ చేసి రోజుకు 30 కార్లు బుక్ చేయాలని చెప్పారు. దీంతో రోజుకు 30 కార్లు వారు పంపిన ఫేక్ అడ్రస్‌లకు బుక్ చేస్తున్నాడు. కమీషన్ డబ్బులు ఇవ్వాలని శ్రవన్ కోరడంతో డబ్బులు పొందేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తీసుకోవాలని చెప్పారు. వారు చెప్పిన ప్రకారం స్కాన్ చేయడంతో ముందుగా రూ.10వేలు శ్రవన్ బ్యాంకు నుంచి డ్రా అయ్యాయి. ఇదేమిటని వారిని ప్రశ్నించడంతో పంపించిన డబ్బులు రావాలంటే మరో రూ.25వేలు పంపించాలని సూచించారు. ఇలా రూ.1.18లక్షల వరకు లాగేశారు. మోసపోయినట్టు గుర్తించిన శ్రవన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.


గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

క్యూలైన్‌లో..

నిలువెత్తు బంగారం..

ముందస్తు మొక్కుల జోరు

మేడారంలో రద్దీగా సమ్మక్క, సారలమ్మల గద్దెలు

మేడారం, ఫిబ్రవరి 8: తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మల సన్నిధి భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా గురువారం తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. మహా జాతర నేపథ్యంలో కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి మేడారం చేరుకున్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించారు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా తల్లుల వద్దకు చేరుకున్నారు. నేరుగా గద్దెలను దర్శించుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం చీర సారెలు సమర్పించుకున్నారు. చల్లంగా చూడాలని కోరుతూ యాట మొక్కులు చెల్లించారు. అనంతరం మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి కుటుంబ సమేతంగా విందుభోజనాలు చేశారు. కాగా, సుమారు లక్షకు పైగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకున్నారని కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. అలాగే జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కుటుంబ సమేతంగా సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మలకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన చందన మాలలు, సుగంధ హారాలు, పట్టు వస్త్రాలను మహా జాతర వేడుకలకు బహుకరిస్తానని చెప్పారు. తల్లులకు పట్టు వస్త్రాలు అందజేసే భాగ్యం తనకు కలగడం సంతోషంగా ఉందన్నారు.

స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేయాలి

మేడారం మహాజాతరకు తరలివస్తున్న భక్తులు జంపన్నవాగులో ఉన్న స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. చింతల్ క్రాస్ రోడ్డు నుంచి రెడ్డిగూడెం కాజ్‌వే వరకు వాగు ప్రమాద స్థాయిలో ఉందన్నారు. భక్తులు మేడారం జంట వంతెనలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్నానఘట్టాలపై మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని అన్నారు.


వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్న శివసత్తులు


జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బస్సులు లేక భక్తుల అవస్థలు

సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులకు సరిపడా బస్సులు లేకపోవడంతో గురువారం అవస్థలు పడ్డారు. మహాజాతరకు ముందుగా మేడారంలో తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన భక్తులు దర్శనాల అనంతరం తిరిగి వెళ్లడానికి బస్సులు లేక మూడు గంటలకు పైగా వేచి చూస్తున్నామని ఆందోళన చెందారు. వేల సంఖ్యలో భక్తులు బస్సు సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నారు. ఈ క్రమంలో భక్తులకు సరిపడా బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు నడపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు ఉదయం మేడారం వచ్చి తల్లులను దర్శించుకొని పరిసర ప్రాంతాల్లో విడిది చేస్తున్నారు. సాయంత్రం తిరిగి వెళ్లడానికి గంటల వ్యవధి పడుతోందన్నారు.


కుక్కకు తులాభారం వేస్తున్న దృశ్యం

కుక్కకు నిలువెత్తు బంగారం

హైదరాబాద్‌కు చెందిన పోశాల జ్యోతి-భిక్షపతి దంపతులు తమ పెంపుడు కుక్క లియో నిలువెత్తు బంగారం(బెల్లం)ను వనదేవతలకు సమర్పించారు. కుక్క అనారోగ్యం బారిన పడినప్పుడు మొక్కుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే కుక్కతో పాటుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నామన్నారు.


గద్దెల ప్రాంగణంలో బూట్లు వేసుకుని నిర్వర్తిస్తున్న పోలీసు

గద్దెల ప్రాంగణంలోకి బూట్లతో పోలీసు..

మేడారం వనదేవతల సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు అధికారి బూట్లతో గురువారం గద్దెల ప్రాంగణంలోకి వెళ్లి భక్తుల దర్శనాలను పరిశీంచారు. ఈ క్రమంలో ఆ అధికారిని గమనించిన వీఆర్‌ఏ రాంబాబు బయటకు తీసుకువచ్చారు. విధులు నిర్వహిస్తే సంప్రదాయాలు పాటించాల్సిన అవసరం లేదా.. అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతన్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

గిరిజన సంప్రదాయంతో జాతర నిర్వహిస్తాం..

అధికారుల సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం మహాజాతరను గిరిజన సంప్రదాయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్‌లో గురువారం తహసీల్దార్ రవిందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం మేడారం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహాజాతరను ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఇందులో భాగంగానే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి భక్తుడు, భక్తురాలు అమ్మవార్లను సులువుగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రత్యేక పారిశుధ్య ఏర్పాట్ల కోసం మేడారం పరిసరాలను 10 సెక్టార్లుగా విభజించి 35 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఉన్న నాలుగు డంపింగ్ యార్డులు కాకుండా మరో ఆరింటిని నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. జాతరలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా పనులు చేపడుతామని పేర్కొన్నారు. 4వేల మంది కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. వీరితో పాటుగా ఐటీసీ, సిగరేణి, ఎన్‌టీపీసీ సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాలతోనూ పారిశుధ్య పనులు కొనసాగుతాయని చెప్పారు. జంతు వ్యర్థాలు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మహా జాతరలో సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను తొలగించడానికి గల్పర్స్ సంఖ్యను పెంచామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 14 క్లస్టర్లుగా విభజించామన్నారు. 5,532 మరుగుదొడ్లను 279 యునిట్స్‌గా ఒక్కో యునిట్‌కు 20 మరుగుదొడ్లు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భక్తులకు 230 చేతి పంపులను అందుబాటులో ఉంచామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు జాతర రోజుల్లో నిరంతరం తాగునీరు అందించేలా 50 లీటర్ల వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. చలువ పందిళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు లోతట్టు, రద్దీ ప్రాంతాలలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాగులో జాతర సమయానికి మూడు నుంచి నాలుగు ఫీట్ల నీటిమట్టం ఉండేలా ఫిబ్రవరి 14 నుంచి 16వ తేదీ వరకు లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. వైద్యశాఖ నుంచి మేడారం పరిసరాల్లో 30 తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆర్టీసీ మహిళా సిబ్బందికి టికెట్ కౌంటర్స్ వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జతరకు వచ్చే భక్తులకు 6వేల బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా ట్రాఫిక్ క్రైమ్ భక్తుల రద్దీ కంట్రోల్ చేయడం జరుగుతుందన్నారు. వనదేవతలను గద్దెలకు తీసుకువచ్చే క్రమంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని రోప్ పార్టీల ద్వారా దేవతల ప్రతిష్ఠకు భంగం కలుగకుండా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వీఐపీ, వీవీఐపీల దర్శనాల వలన సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని అన్నారు. మహా జాతరకు 23వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ఠ భద్రత ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ బహుదూరం!

(5వ పేజీ తరువాయి)

చర్చించాలన్నా వారు మేడారం నుంచి వరంగల్‌లో వ్యయ ప్రయాసాలకు ఓర్చి రావలసిందే. ప్రధాన జాతర సమయంలో నాలుగు రోజుల పాటు దేవాదాయశాఖ అధికారులు మేడారంలో స్థానికంగా అందుబాటులో ఉన్నా మిగతా రోజులు ఇక్కడ హనుమకొండలో తిష్టవేసి ఉంటారు. హుండీల లెక్కింపు, వాటాల పంపకం తదితర వ్యవహారాలన్నీ హనుమకొండ కేంద్రంగా సాగుతుంటాయి. వీటి పరిశీలన, పర్యవేక్షణకు పూజారులు, పూజారుల సంఘం నాయకులు ప్రతీసారి మేడారం నుంచి వరంగల్‌కు రావలసి వస్తోంది. అదే అన్నిహంగులతో కూడిన ఈవో కార్యాలయాన్ని మేడారంలోని జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే ఈ ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వాచ్‌టవర్ కింద..

మేడారంలో ప్రస్తుతం ఈవో కార్యాలయం తల్లుల గద్దెల వద్ద వాచ్‌టవర్ కింద చిన్న ఇరుకు గదిలో ఉంది. ఇందులో ఒక టేబుల్, ఒక కుర్చీ, ఒకరు లేదా ఉద్యోగులు మాత్రమే కూర్చునే వీలున్నది. ఇక్కడ ఈవో ఆఫీసు ఉందన్న విషయంలో చాలా మందికి తెలియదు. ఇంత పెద్ద జాతరకు సంబంధించిన దేవాదాయ శాఖ ఆఫీసు ఇంత చిన్న గదిలో కొనసాగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ఉండడానికి దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పెద్దగా ఇష్టపడడం లేదు. వరంగల్ నగరంలో ఉండడానికి అలవాటుపడ్డ అధికారులు, ఉద్యోగులు మేడారంలో విధుల నిర్వహణను శిక్షగా భావిస్తుంటారు. ఇక్కడ డ్యూటీ పడిన ప్రతీ రోజు అప్‌అండ్‌డౌన్ చేస్తుంటారు. మేడారంలో జాతర సందర్భంలో తప్ప మిగతా సమయంలో సిబ్బంది పెద్దగా ఉండరు. ఒకరిద్దరు ఉద్యోగులు తప్ప ఎవరూ కనపడరు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికపై పూర్తిస్థాయిలో ఈవో ఆఫీసును ఏర్పాటు చేస్తే ఇక్కడే ఉండాల్సి వస్తుందన్న కారణంతో ఇక్కడ కార్యాలయం లేకుండా చాలాకాలంగా అధికారులు అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయ భవనం లేకపోవడంతో ప్రధాన జాతర జరిగే సమయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో లేదా తాత్కాలికంగా వేసిన గూడారాల్లో ఉంటారు.

ధార్మిక భవన్‌కు మేడారం నిధులు

పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ధార్మిక భవన్ పేరుతో రూ.3కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఈ మూడు కోట్లలో భద్రకాళి దేవస్థానం నుంచి రూ.కోటి, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయం దేవస్థానం నుంచి రూ.కోటితోపాటు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఆదాయం నుంచి మరో రూ.కోటిని వాడుకున్నారు. ఇటీవల వరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం ఈవో కార్యాలయాలు హనుమకొండ అద్దె భవనంలో కొనసాగుతుండేవి. ధార్మిక భవనం నిర్మాణమైన తర్వాత ఇందులోకి మారాయి. వాస్తవానికి ఈ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ స్థానిక దేవాలయాల నిధులనువాడుకున్నారు. మేడారంలో ఉండాల్సిన ఈవో కార్యాలయాన్ని పట్టించుకోకుండా ఆజాతర నిధులను మాత్రం ఇక్కడ ఎట్లా వినియోగిస్తారని పూజారులు, భక్తులు నిలదీస్తున్నారు. ధార్మిక భవనం నిర్మాణానికి సమ్మక్క సాలరమ్మ జాతర నిధుల నుంచి తీసుకున్న రూ.కోటి నిధులతో మేడారంలోనే ఆధునాతనమైన అన్ని హంగులతో విశాలమైన ఈవో కార్యాలయాన్ని నిర్మించవచ్చు. అదేం పట్టించుకోకుండా ధార్మిక భవనానికి వాడుకొని అందులోనే ఒక భాగంలో మేడారం ఈవో ఆఫీసుకు చోటు కల్పించారు.

ఎప్పటి నుంచే డిమాండ్

వరంగల్‌లోని మేడారం ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ తెరమీదికి వస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మేడారం ఒక దర్శనీయ స్థలంగానే కాక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా కూడా భాసిల్లుతోంది. ఈ దృష్ట్యా అక్కడ భక్తులు బస చేయడానికి శాశ్వత ప్రాతిపదికపై వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గద్దెల సమీపంలో పది గదులతో ఒక భవనాన్ని నిర్మించినప్పటికీ నిర్వహణలేక దాని పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గద్దెల వద్ద దేవాదాయం ఉద్యోగులను నియమించినా వారికి నిలువ నీడ, కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. అదే పూర్తిస్థాయిలో ఈవో కార్యాలయాన్ని నిర్మించినట్లయితే భక్తుల సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించేందుకు,అవసరమైన ఏర్పాట్లు ఎప్పటికప్పుడు చేయడానికి వీలుంటుందని పూజారులు అభిప్రాయపడుతున్నారు.

మేడారంలో ఈవో ఆఫీసు ఏర్పాటు చేయాలి..

సిద్దబోయిన జగ్గారావు, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు



మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాశస్త్యం రోజురోజుకూ పెరుగుతోంది. జాతర ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిని గడిస్తోంది. రెండేళ్లకోసారి ఈ జారతకు కోటి మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఇంత పెద్ద జాతరకు మేడారంలో ఈవో కార్యాలయం లేకపోవడం విడ్డూరం. దీని కార్యాలయాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడం మరీ దారుణం. ప్రతీ చిన్న విషయానికి 130 కి.మీ. దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి పూజారులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు జాతర నిరంతరం జరుగుతోంది. కనుక ఇప్పటికైనా ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలి. అన్ని హంగులతో కూడిన భవనంలో ఏర్పాటు చేయాలి. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి.

భక్తులకు అసౌకర్యం కలగనీయం

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● మేడారంలో రాత్రివేళ జాతర పనుల పరిశీలన

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనీయమని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మంత్రి మేడారం వచ్చారు. వనదేవతల గద్దెల పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వచ్చిన పలువురు భక్తులతో సీతక్క మాట్లాడారు. ప్రముఖల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌ను పరిశీలించారు. స్థానిక పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. భక్తులు జాతరకు ముందుగానే లక్షలాదిగా తరలివస్తున్నారని, వారికి సదుపాయాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పుడు కూడా జాతర జరుగుతోందనే విధంగా భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగనీయవద్దని తెలిపారు. తాగునీరు, పారిశుధ్య చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. మరో వారం రోజుల్లో ఏ పనీ మిగిలి ఉండవద్దన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర జరుగుతున్న విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెకర్ శ్రీజ, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీపీవో వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీఎస్పీ రవీందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, తదితరులు పాల్గొన్నారు.


భక్తులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పైసలు కొట్టే... పోస్టు పట్టే!

● పోలీసు బదిలీల్లో పొలిటికల్ చేతివాటం ● ఒక్కో పోస్టుకు రూ.5లక్షల నుంచి రూ.30లక్షలు



వరంగల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలీసుల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారాయా..? వేలం పాటను తలపించేలా సాగిన ఈ కాసుల వ్యవహారంలో పోటాపోటీగా పోస్టులు దక్కించుకున్నారా..? అంటే అవుననే ప్రచారమే జరుగుతోంది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 29మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో రాజకీయ జోక్యం మితిమీరి పోయిందన్న చర్చ జరుగుతోంది. మంత్రితో పాటు ఒకరిద్దరు మినహా మిగతా లీడర్లు పోలీసు పోస్టింగులను వేలం తరహాలో ఎవరు ఎక్కువ ఇస్తే వారికే సిఫారసు లేఖలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉంటే బదిలీల్లో జరిగిన ఈ ముడుపుల బాగోతంపై ఇంటిలిజెన్స్ అధికారులు సీఎంకు ఓ నివేదిక కూడా అందించారన్న సమాచారం పోలీసువర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా పోలీసు బదిలీలు జరిగాయి. పదేళ్ల అధికారంలోకి రావటంతో తమకు అనుకూలంగా ఉండేవారిని తమ ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పించుకోవడం ఆనవాయితే. అందులో భాగంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి 29మంది సీఐల బదిలీలు జరగ్గా, వారిలో చాలామంది గురువారం విధుల్లో చేరారు. అయితే ఈ బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. హనమకొండ జిల్లాలోని నగర శివారులో ఓ పోలీస్‌స్టేషన్ పోస్టును ఏకంగా రూ.30లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే నగరంలోని ఓ ఎస్‌హెచ్‌వో పోస్టు రూ.25లక్షల ధర పలికింది. ఈ పోస్టుకే మరో అధికారి రూ.20లక్షల వరకు ఇచ్చేందుకు ముందుకు రాగా, మరో పోలీసు అధికారి రూ.25లక్షలు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో సదరు అధికారికే సిఫారసు లేఖ ఇచ్చారని, దీంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే జనగామ జిల్లాలో ఓ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్‌కు తక్కువగా రూ.5లక్షలే ధర పలకగా, అదే నియోజకవర్గంలోని మరో పోలీస్‌స్టేషన్‌కు ఏకంగా రూ.20లక్షల ముడుపులు చెల్లించి సీటు సంపాదించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర శివారులోని మరో పోలీసు స్టేషన్ పోస్టుకు కూడా ఏకంగా రూ.15లక్షలు ఫిక్స్ చేసుకొని సిఫార్సు లేఖ ఇవ్వటంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇలా ఒక్కొక్క స్టేషన్‌కు ఒక్కో రేటుకు పోస్టింగులు అమ్ముకున్నారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కృషి చేశారని అనుమానించిన పోలీసు అధికారులకు కూడా తాజా బదిలీల్లో పోస్టింగులు ఇవ్వటం పోలీసువర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. జనగామ జిల్లాలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారికి అదే జిల్లాలో మరో నియోజకవర్గంలో పోస్టింగు ఇవ్వటం చర్చనీయాంశమైంది. ఇక మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మాత్రం ఇలాంటి బేరసారాలు జరగలేదని, ప్రజల వద్ద పైసలు తీసుకోకుండా పని చేయాలనే నిబంధనలతో ఆ ప్రాంతంలో పోలీసులకు పోస్టింగులు ఇచ్చారన్న చర్చ జరుగుతోంది. తన నియోజకవర్గంతో పాటు మరో రెండు మూడు చోట్ల పోస్టింగులకు సిఫార్సు చేసినట్టు సమాచారం. మరో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా పైసల జోలికి వెళ్లకుండా పోస్టింగులకు సిఫారసు లేఖలు ఇచ్చినట్టు తెలుస్తుండగా.. రూ.లక్షలు వెచ్చించి పోస్టింగులు పొందిన కొంతమంది అధికారులు మళ్లీ ఆ సొమ్మును ఎలా సంపాదిస్తారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. పైసలు ఇచ్చి వచ్చిన అధికారులు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సీఎంకు ఇంటెలిజెన్స్ నివేదిక

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు పోస్టింగుల్లో రాజకీయ జోక్యం మితిమీరి పోయిందనమ్న వ్యవహారంపై సీఎంవో వర్గాలు దృష్టిసారించాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి' సంచికలో 'పోలీస్ పోస్టింగుల్లో పొలిటికల్ వార్' శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో తమ సిఫార్సులకు ఎక్కడ బ్రేక్ పడుతుందో అనే ఆందోళనతో కొంతమంది లీడర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే బదిలీతంతు ముగించారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ బదిలీల్లో భారీగా సొమ్ములు చేతులు మారినట్లుగా ప్రచారం జరగటంతో గురువారం ఇంటెలిజెన్స్ అధికారులు, సిబ్బంది పోస్టింగులపై సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఎవరు ఎంత ఇచ్చారు..? ఎక్కడ పారదర్శకంగా పోస్టింగులు ఇచ్చారు..? అనే కోణంలో నిఘా వర్గాలు హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందించినట్టు తెలుస్తోంది. మొత్తానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కమిషనరేట్ పరిధిలో పోలీస్ పోస్టింగుల్లో చేతులు మారిన వైనం రాష్ట్రవ్యాప్త చర్చకు తెరతీసింది.

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తికరంగా మారగా టికెట్ వస్తే చాలు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఖద్దరు దుస్తులు ధరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడు స్థానానికి భారీ పోటీ నెలకొంది. మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసిన ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన డంగ్రోత్ నాగరాజునాయక్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ భట్టు రమేష్ కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ టికెట్ రేసులో ఉన్నారు. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎస్పీడీసీఎల్ డీఈగా పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన ఎట్టి వెంకన్న సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. అలాగే వరంగల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ టికెట్‌కోసం ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హరికోట్ల రవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన హరికోట్ల రవికి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సత్సంబంధాలు ఉన్నాయని, వీరి మద్దతుతో ఆయన ఇటీవల ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కలిసి వచ్చారని సమాచారం. ఒకవైపు టికెట్ దరఖాస్తు చేసుకుంటేనే తమ గాడ్‌ఫాదర్ల ద్వారా ఆశావహులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో ఎవరికి టికెట్ దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది

'గృహజ్యోతి' వివరాలను దగ్గర ఉంచుకోండి..

ఎన్‌పీడీసీఎల్ ఎస్‌సీ మధుసూదన్‌రావు

హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి : గృహజ్యోతి పథకం కింద ప్రజాపాలన సందర్భంగా అందచేసిన సమాచారాన్ని ధృవీకరణ కార్యక్రమం తమ సిబ్బంది నిర్వహిస్తున్నారని ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు ప్రజాపాలనలో అందచేసిన రశీదును, ఆహార బధ్రతాకార్డు (రేషన్‌కార్డు) నెంబర్, ఆధార్ కార్డు నెంబర్‌ను అందుబాటులో ఉంచుకోవలసిందిగా ఆయన కోరారు. ఒక వేళ ఏదైనా కారణంవల్ల తమ సిబ్బంది వచ్చినప్పుడు అందుబాటులో లేకుంటే వివరాలను దగ్గరలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలోగానీ, లేదా విద్యుత్ సహాయక గణాంక అధికారి కార్యాలయంలో గానీ సమర్పించి ధ్రువీకరించుకోవాలని కోరారు.

మోదీ సర్కార్ వివక్ష వీడాలి : సీపీఎం



భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కాకతీయఖని, ఫిబ్రవరి 8 : కేరళ వామపక్ష ప్రభుత్వంపై మోదీ సర్కార్ వివక్షతను విడనాడాలని సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంపై బీజేపీ ప్రభుత్వం చూపుతున్న కక్షసాధింపు చర్యలను ఖండిస్తున్నామన్నారు. కేరళ రాష్ట్రానికి కేంద్రం అధిక నిధులను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, మహేందర్, నరేష్, విజయలక్ష్మి, శ్రీలత, గీత, రజిత పాల్గొన్నారు.

కుష్టుపై విద్యార్థులకు అవగాహన సదస్సు

మంగపేట, ఫిబ్రవరి 8: మండలంలోని రాజుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ హాజరై విద్యార్థులకు కుష్టువ్యాధి గురించి వివరించారు. చర్మవ్యాధులు, ఎలర్జీ, కుష్టు వ్యాధి ఏవిధంగా సోకుతాయో వివరించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ అరుణ, ఉపాధ్యాయులు వీరనారాయణ, రాజ్యలక్ష్మి, పావని, పద్మ, సుజాత, బాలాజీ, లక్ష్మీనారాయణ, ప్రమీల, సురేందర్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాడ్వాయి, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తనుగుల వర్ష, కందికొండ శ్రావణ్, వడ్డాల రవిచంద్రలు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు సాధించడం పట్ల అధ్యాపకులు అభినందించారు. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవిలయ్యతో పాటు అధ్యాపకులు విద్యార్థులను అభినందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు, సిబ్బంది భిక్షం, కిషన్, శ్వేత, రాజు, అశోక్, శ్రీలత, నాగరాజు, దివ్య, సోఫియా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 8: ఏటూరునాగారం నుంచి మేడారానికి బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరుతున్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర గడువు దగ్గర పడుతుండగా ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. ఇప్పటి నుంచే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి మహాజాతరకు వేలాది సంఖ్యలో భక్తులు ఏటూరునాగారంకు తరలివస్తున్నారు. బస్టాండ్ నుంచి మేడారం వెళ్లేందుకు బస్సులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గంటలు తరబడి బస్టాండ్‌లోనే వేచి చూసి ప్రైవేటు వాహనాలను ఆశయిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనదారులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

దుప్పట్లు, దోమ తెరల పంపిణీ



అకినేపల్లిమల్లారం ఎస్టీ కాలనీలో దుప్పట్లు అందించిన సొసైటీ సభ్యులు

మంగపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని అకినేపల్లి మల్లారం ఎస్టీ కాలనీలో 30 కుటుంబాలకు గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమ తెరలు, హైజెనిక్ కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ ఎంసీ మెంబరు కొత్తపల్లి ప్రసాదరావు హాజరై మాట్లాడారు. తాము పంపిణీ చేసిన ప్రతి వస్తువును సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంసీ మెంబరు కల్లెబోయిన సురేష్, వలంటీర్ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత

▸▸ రెగ్యులర్ పోస్టులు రావడంతో వెళ్లిపోయిన స్టాఫ్ నర్సులు ▸▸ డిప్యూటేషన్ సిబ్బందితో అందని వైద్య సేవలు



కాటారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కాటారం, ఫిబ్రవరి 8 : కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు సబ్ సెంటర్లలో సరిపడా వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పీహెచ్‌సీలో ఎన్‌హెచ్ఎం పథకం ద్వారా కాంట్రాక్ట్ బేసిస్‌పై స్టాఫ్ నర్సులుగా పనిచేసిన ముగ్గురు రెగ్యులర్ పోస్టుల్లో ఎంపిక కావడంతో 100 పడకల ఆస్పత్రికి వెళ్లగా మరికొందరు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో వైద్య సేవలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ఐదు మండలాల కూడలిగా ఉన్న కాటారంలో 353(సీ) జాతీయ రహదారి పక్కనే ఉండి 24 గంటల వైద్యశాలగా పేరొందిన పీహెచ్‌సీ, దాని పరిధి సబ్‌సెంటర్లలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నారు. అలాగే ఉన్న సిబ్బందిని కూడా ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై పంపించడం గమనార్హం. జిల్లాలో అన్ని రంగాల్లో ముందంజలో ఉండే పీహెచ్‌సీలో సరిగా సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉన్న వైద్యురాలు, ఇతర సిబ్బందిపై భారం పడుతోంది. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం 120 మందికి పైగానే వైద్య సేవల కోసం వస్తారు. నెలలో 4వేల మందికి పైగా పలు రకాల వైద్య సేవల కోసం రావడంతో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే సేవలందిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్లలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలను పీహెచ్‌సీకి రప్పిస్తున్నారు. హెచ్ఈవో, హెచ్‌వీ, హెచ్ఎస్, హెల్త్ అసిస్టెంట్లను డిప్యూటేషన్‌పై పంపించడంతో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్..

పీహెచ్‌సీలో గతంలో ఉన్న ఆర్వోప్లాంట్ పనిచేయడంలేదు. పీహెచ్‌సీకి కేటాయించిన ట్యాంకు సైతం పూర్తి స్థాయిలో తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీలు భర్తీ చేయడంతో పాటు సిబ్బంది డిప్యూటేషన్‌ను రద్దు చేసి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఫుడ్‌సేఫ్టీ మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని తెలంగాణ ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఆహార వ్యాపారులకు అవగాహన కల్పించేందుకు ములుగులోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఫుడ్‌సేఫ్టీ మొబైల్ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫుడ్‌సేఫ్టీ మొబైల్ వాహనాలు మేడారం జాతరలో భక్తులందరికీ అందుబాటులో ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి అమృతశ్రీ, ములుగు ఫుడ్ అధికారి రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

6 ఇంక్లైన్‌ను తనిఖీ చేసిన డీడీఎంఎస్



కేటీకే 6వ గని అధికారులతో డీడీఎంఎస్ సనత్‌కుమార్

కాకతీయఖని, ఫిబ్రవరి 8 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 6వ గనిని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) సనత్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. మొదటగా అండర్ గ్రౌండ్‌లోని 1వ సీమ్ ఎస్ఎస్-5 ప్యానల్‌ను పరిశీలించారు. అనంతరం గని ప్లాన్‌ను పరిశీలించారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లానింగ్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రక్షణ పరికరాలు వినియోగించి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గుప్తా, రాజశేఖర్, రాంబరోసా మహతో, నాగరాజు, శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు బిల్లులేవీ?

▸▸ నెల రోజులుగా ఎదురుచూపులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ఆపరేటర్లకు బిల్లులు చెల్లించడంలో అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన వారం రోజుల్లోనే బిల్లులు చెల్లిస్తామన్న అధికారులు నెల రోజులు కావొస్తున్నా రాకపోవడంతో ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూపాలపల్లి జిల్లాలో 1,09,517 లక్షల కుటుంబాల నుంచి 1,37,454 ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటిని ఆన్‌లైన్ చేసేందుకు 500లకు పైగా మంది ఆపరేటర్లను నియమించారు. వీరిలో 60 శాతం ప్రభుత్వ, 40 శాతం ప్రైవేటు ఆపరేటర్లు ఉన్నారు. ప్రైవేటు ఆపరేటర్లకు ఒక దరఖాస్తుకు రూ. 15, ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఆపరేటర్లకు రూ.5 చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకొని వారికి ట్రైనింగ్ ఇచ్చి పనిని ప్రారంభించారు.

జనవరి 12వ తేదీ వరకే మొత్తం దరఖాస్తులను ఆపరేటర్లు ఆన్‌లైన్ చేశారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన వారం రోజుల్లోనే పేమెంట్ చేస్తామన్న అధికారులు నెల రోజులు కావొస్తున్నా వాటి ఊసే ఎత్తడంలేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన సుమారు రూ.12 లక్షలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆపరేటర్లు కోరుతున్నారు. ఆపరేటర్లకు బిల్లుల చెల్లింపులపై కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబును వివరణ కోరగా నిధులు విడుదల కాగానే అందరికి బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

బినామీ డీలర్లకు చెక్..!

(5వ పేజీ తరువాయి)

ఆలోచిస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఒకే ఇంట్లోని వారే రేషన్ షాపులు నిర్వహించడంతో పాటు వెలుగు, ఇతర సంస్థల్లో పనిచేస్తూ ప్రభుత్వం నుంచి పారితోషికం అందుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇంట్లో ఒకరికి మాత్రమే అవకాశం కల్పించి వారి స్థానంలో నిరుద్యోగ యువతకు కేటాయించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇలా చేస్తే గ్రామంలో నిరుద్యోగం తగ్గించడంతో పాటు ఉపాధి కల్పించినట్లు అవుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

బినామీ డీలర్లను గుర్తిస్తున్నాం..

- కె.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్, భూపాలపల్లి

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న రేషన్ డీలర్లలో బినామీ డీలర్లను గుర్తిస్తున్నాం. సంబంధిత అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో బినామీ డీలర్ల లిస్టు రెడీ అవుతుంది.

టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలి



టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 8 : ఈ నెల 13వ తేదీన జరిగే టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ అన్నారు. ఏటూరునాగారంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. 13న ఏటూరునాగారం డివిజన్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగా, విద్యార్థిని, విద్యార్థులు పూర్తి వివరాల కోసం 7601091296 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బట్ట స్వామి, మండల కార్యదర్శి ముక్కెర ధనుష్, డివిజన్ ఉపాధ్యక్షుడు కావేరి బైరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

చిట్యాల, ఫిబ్రవరి 8 : మండలంలోని మానేరు, చలివాగు పరిసర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ వేణుచందర్ అన్నారు. మండలంలోని అందుకుతండా శివారులో గురువారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మానేరు, చలివాగు పరిసర ప్రాంతాల్లో ఎక్స్‌కావేటర్‌తో పెద్ద గుంతను తీశారన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

▸▸ పర్యవేక్షిస్తున్న మండల, జీపీల ప్రత్యేకాధికారులు



గంగారంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎంపీడీవో శంకర్‌నాయక్

కాటారం, ఫిబ్రవరి 8 : మండల వ్యాప్తంగా 24 జీపీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు సాగే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గురువారం రోడ్లకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, గడ్డి, చెట్ల పొదల తొలగింపు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌ను కాటారం జీపీలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, రేగులగూడెం, శంకరంపల్లి జీపీల్లో తహసీల్దార్ నాగరాజు, ధన్వాడ, గంగారంలో ఎంపీడీవో శంకర్ నాయక్, చిద్నెపల్లి, ప్రతాపగిరిలో ఎంపీవో ఉపేంద్రయ్య, అంకుసాపూర్, బయ్యారంలో డీసీవో శైలజ, చింతకానిలో డీటీ రామ్మోహన్, జాదరావుపేట, వీరాపూర్‌లో ఏవో రామకృష్ణ, ఒడిపిలంవంచ, ధర్మసాగర్‌లో వెటర్నరీ డాక్టర్ రాకేష్‌శర్మ, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లిలో డాక్టర్ అహాషేక్, దామెరకుంట, గుండ్రాత్‌పల్లిలో ఏఈ రాజశేఖర్, నస్తూరుపల్లి, మద్దులపల్లిలో ఏఈ కళ్యాణ్ పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, కారోబార్లు పాల్గొన్నారు.

నామమాత్రంగా కోతుల పట్టివేత

▸▸ భయం భయంగా పలు కాలనీల వాసులు

▸▸ ఒక్కో కోతికి రూ.350 చెల్లింపు..



శాంతినగర్ కాలనీలో ఇంటి గోడలపై తిరుగుతున్న కోతులు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 8 : భూపాలపల్లిలో కోతుల పట్టివేత కార్యక్రమాన్ని మునిసిపల్ అధికారులు నామమాత్రంగా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కారణం ఏమిటంటే.. వారు ఎక్కడయితే పట్టుకున్నామని చెబుతున్నారో.. అక్కడే కోతులు దర్శనమిస్తున్నాయి. పైగా ఒక్కో కోతికి రూ.350 కేటాయిస్తూ కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసింది. కానీ, పెద్దగా పట్టుకున్న దాఖలాలు లేవని విమర్శలు వస్తున్నాయి. భూపాలపల్లి పట్టణంలో 30 వార్డులు ఉన్నాయి. గత 15 రోజుల నుంచి మూడు వార్డులలో మాత్రమే పట్టుకున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. పైగా ఆయా కాలనీలలో 800 కోతులు పట్టుకున్నట్లు చెబుతున్నారు. అంటే.. ఆ కోతులకు రూ.2.80 లక్షలు ఖర్చు చేశారన్నమాట. ఇంకా రెండు వేలకు పైగా కోతులను పట్టుకునేందుకు ప్రణాళికలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కాలనీల్లో భయం భయం..

భూపాలపల్లి పట్టణం గత కొంతకాలం నుంచి కోతులకు నిలయంగా మారింది. ప్రతీ కాలనీలో వందలాది కోతులు బీభత్సం చేస్తున్నాయి. మహిళలు ఇంటిముందు కల్లాపిచల్లి ముగ్గులు పెట్టుకోవడానికి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా బట్టలు పిండుకోవడానికి, వంటపాత్రలు కడగడానికి బిక్కుబిక్కుమంటూ పనిచేసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం హయాం నుంచి ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు పట్టణంలోని కోతులను పట్టుకునేందుకు మునిసిపాలిటీ అధికారులు శ్రీకారం చుట్టారు. కానీ, కోతులను పట్టుకోవడంలో మాత్రం విఫలం అవుతున్నారని, తూతూ మంత్రంగా పట్టుకుని వదిలివేస్తున్నారని పలు కాలనీవాసులు చెబుతున్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి



గ్రీశ్మంత్ (ఫైల్)

మంగపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని రమణక్కపేటకు చెందిన ముస్కె గ్రీశ్మంత్(14) గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. రమణక్కపేటకు చెందిన ముస్కె మాధవి-వెంకటేశ్వర్లు దంపతులకు రాకేష్, గ్రీశ్మంత్ ఇరువురు కుమారులు. సమీపంలోని రాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రీశ్మంత్ 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలుడు తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని గోదావరిలో ఈతకు వెళ్లారు. ఈక్రమంలో గ్రీశ్మంత్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు బిగ్గరగా అరవగా సమీపంలో చేపలు పడుతున్న వారు వచ్చి గ్రీశ్మంత్‌ను బయటకు తీశారు. అప్పటికే ఆ బాలుడు మరణించాడు. ఈ విషయమై మంగపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాధితుడికి రూ.5లక్షల చెక్కు అందజేత

టేకుమట్ల, ఫిబ్రవరి 8: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మారపల్లి రాజయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతుండగా రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం అందజేశారు. రాజయ్య చెట్టుపై నుంచి పడటంతో తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. పక్కటెముకలు విరగాయని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సాయం కోరగా ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించి ఆదుకున్నారు.

పాత రుద్రారంలో ఇల్లు దగ్ధం

మల్హర్, ఫిబ్రవరి 8 : మండలంలోని పాత రుద్రారంలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పబ్బ మొండయ్య అనే వ్యక్తి ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మొండయ్య ఇంట్లోని కొంత భాగంలో కుటుంబంతో నివసిస్తుండగా మిగిలిన మరికొంత భాగం పశువులకు, వ్యవసాయ సామగ్రికి వినియోగిస్తున్నాడు. ఇంటిల్లిపాది నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంకు పేలడంతో మెళకువ రాగా కుటుంబసభ్యుల కేకలతో ఇరుగుపొరుగు వచ్చే సరికి ఇల్లు కాలిపోయినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో లేగ దూడతో పాటు ద్విచక్ర వాహనం, నిత్యావసర సరుకులు, వ్యవసాయ సామగ్రి పూర్తిగా కాలిపోయి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు మొండయ్య తెలిపారు. కాగా, గురువారం సంఘటన స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన వెంట కార్యదర్శి సాయిచరణ్, గ్రామస్తులు ఉన్నారు.

ఆడ పిల్లలకు రక్షణ కల్పించాలి

మహాముత్తారం, ఫిబ్రవరి 8: మండలంలోని బోర్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహదేవపూర్ సీడీపీవో రాధిక బాలికలకు వివిధ అంశాలపై వివరించారు. బాలికలకు చట్టపరమైన హక్కులను, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, వైద్యం అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి కోఆర్డినేటర్ అనూషా, పాఠశాల హెచ్ఎం రాంసింగ్, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల సాయం

మహాముత్తారం, ఫిబ్రవరి 8: మండల కేంద్రానికి చెందిన బానోత్ జగన్ నాయక్ అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతని స్నేహితులు ఆ కుటుంబానికి రూ.1.71 లక్షలు గురువారం అందజేశారు. జగన్‌నాయక్ కూతురు, కొడుకు పైచదువుల కోసం అందజేసినట్లు స్నేహితులు తెలిపారు. కార్యక్రమంలో సుమారు 50 మంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల సర్వే

కాటారం, ఫిబ్రవరి 8 : మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజా పాలనలో భాగంగా అభయహస్తం కింద పలు పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి స్థితిగతులను పరిశీలించడానికి గురువారం సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీపీల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది మహాలక్ష్మి, గృహజ్యోతి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తు ఫారం, ఆధార్, గ్యాస్, కరెంట్ మీటర్, రేషన్‌కార్డు నెంబర్లను తీసుకుని జిరాక్స్ ప్రతులను సేకరిస్తున్నారు. దరఖాస్తుల్లో పలువురు గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటర్ల నెంబర్లు తప్పుగా నమోదు చేయడంతో వాటిని సరిచేస్తున్నారు. సర్వేను మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో శంకర్ నాయక్, ఏడీఈ నాగరాజు, ఏఈ మేఘనాథ్, ఎంపీవో ఉపేంద్రయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, లైన్‌మన్లు, జూనియర్ లైన్‌మన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు చెప్పిన కలెక్టర్

▸▸ బోర్డుపై లెక్కలు చేయించి పరిశీలన



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 8 : పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు గాను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా భూపాలపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థిని విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, ఆంగ్లం పాఠాలు బోధించారు. అలాగే ఉపాధ్యాయులు గత కొన్ని రోజులుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తీరును, విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు కలెక్టర్ పలువురు విద్యార్థులకు బోర్డుపై లెక్కలు ఇచ్చి వాటిని చేయాలని ఆదేశించారు. ఇంకా విద్యార్థులు స్పీడ్‌గా చదువుకుని పరీక్షల్లో అత్యధికంగా మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యాలను మరింత పెంచేందుకు గాను విద్యాశాఖ అధికారులు రెట్టింపు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పిన బోధనలను స్వయంగా పరిశీలించేందుకు కలెక్టర్ విద్యార్థులచే బోర్డుపై లెక్కలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మేధోశక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. కల్పన చావ్లా, శ్రీనివాస రామానుజాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. చదువుతో పాటు సాధారణ జ్ఞానం కూడా అవసరమని, దీని కోసం రకరకాల పుస్తకాలు చదవాలన్నారు. అలా అయితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. మార్చి నెలలో 10వ తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఏఏ విషయాలలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అధిక మార్కులు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో రాంకుమార్, సెక్టోరియల్ అధికారి కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ములుగు నియోజకవర్గంలో 2,31,883 మంది ఓటర్లు

▸▸ రెండు నెలల్లో 5,517 ఓట్ల పెరుగుదల

ములుగు, ఫిబ్రవరి 8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను గురువారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా కలెకర్ ఓ ప్రకటన జారీ చేశారు. మొత్తం 2,31,883 మంది ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. వీరిలో పురుషులు 1,13,262 మంది, మహిళలు 1,18,594 మంది, థర్డ్ జెండర్‌లు 27 మంది ఉన్నారు. రెండు నెలల క్రితం నవంబరు 30న జరిగిన ఎన్నికల నాటికి నియోజకవర్గంలో 2,26,366 మంది ఉండగా 5,517 ఓట్ల పెరుగుదల కనిపించింది. ఇప్పుడు కూడా మహిళా ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారు. అదేవిధంగా థర్డ్ జెండర్ ఓటర్ల సంఖ్య కూడా పెరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల నాటికి 23 మంది ఉండగా మరో నలుగురు పెరిగారు. మండలాల వారిగా ఓటర్ల వివరాలు ఈవిధంగా ఉన్నాయి

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ములుగు	24,704	26,513	10	51,227
వెంకటాపూర్	15,973	16,761	01	32,735
గోవిందరావుపేట	12,009	12,779	02	24,790
తాడ్వాయి	8,885	9,236	01	18,122
ఏటూరునాగారం	11,618	12,417	06	24,041
కన్నాయిగూడెం	4,789	4,882	0	9,671
మంగపేట	19,200	19,453	04	38,657
కొత్తగూడ	11,567	12,010	02	23,579
గంగారం	4,517	4,543	01	9,061